క్లుప్తంగా

చట్టాలపై బాలికలకు అవగాహన



బాలల చట్టాలపై అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ శివనారాయణస్వామి

కదిరి అర్బన్: పట్టణంలోని జెడ్పీ గర్ల్స్ హైస్కూల్‌లో బాలికల బుధవారం డీఎస్పీ శివనారాయణస్వామి ఆధ్వర్యంలో బాల్యవివాహాలు, పోక్సో, బీఎన్ఎస్ యాక్ట్, డయల్ 100, 112పై బాలికలకు అవగాహ కల్పించారు. బాలికలకు ఎవరైనా ఇబ్బంది పెడుతుంటే నిర్భయంగా ఫిర్యాదు చేయవచ్చన్నారు. మన కెందుకులే అని మిన్నకుండిపోతే అనర్థాలు జరిగే ప్రమాదముందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటాచలంతో పాటు పట్టణ సీఐ నారాయణరెడ్డి, ఎస్ఐలు, శక్తి టీం సభ్యులు పాల్గొన్నారు.

యూత్ వింగ్ రాష్ట్ర కార్యదర్శిగా నరేష్



రాష్ట్ర కార్యదర్శిగా ఎంపిక చేసిన కోర్ కమిటీ సభ్యులు

ధర్మవరం: ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సంఘం అనుబంధ యూత్ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా ధర్మవరానికి చెందిన చింతకాయల నరేష్ నియమితులయ్యారు. ఈ మేరకు కోర్ కమిటీ సభ్యులు ఆయనకు బుధవారం ఉత్తర్వులు అందజేశారు. చింతకాయల నరేష్ మాట్లాడుతూ వాల్మీకి బోయల హక్కుల కోసం, ఎస్టీ హోదా పునరుద్ధరణ కోసం కృషి చేస్తానన్నారు.

తిక్క ఆకు మచ్చలు నివారించుకోవాలి



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ సిబ్బంది, రైతులు

నల్లమాడ: వేరుశనగ పైరుకు తిక్క ఆకు మచ్చలు సోకకుండా నివారణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి వి.అబ్దుల్ హక్ రైతులకు సూచించారు. 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని వంకరకుంట, బసిరెడ్డిపల్లి గ్రామాల రైతులు సాగు చేసిన వేరుశనగ పంటను ఏఓ పరిశీలించారు. తిక్క ఆకు మచ్చలు సోకకుండా కాపర్ ఆక్సిక్లోరైడ్ 40 గ్రాములు 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. లేదా ఒక ఎకరాకు ఒక లీటరు వేప నూనె పిచికారీ చేసుకోవాలని సూచించారు. అనంతరం ఆముదంలో అంతర పంట సాగుకు వీలుగా కొర్ర విత్తనాలను రైతుమిత్ర సభ్యులకు అందజేశారు. గ్రామ వ్యవసాయ సహాయకురాలు సంధ్య, రైతులు పాల్గొన్నారు.

రేషన్ సరుకులు సకాలంలో అందించండి

గాండ్లపెంట: చౌక డిపో డీలర్లు కార్డుదారులకు రేషన్ సరుకులు సకాలంలో పంపిణీ చేయాలని తహసీల్దార్ బాబూరావు ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం మండలంలోని చౌకడిపో డీలర్లతో సమావేశం నిర్వహించారు. ప్రతి నెలా ఒకటి నుంచి 15వ తేదీ వరకు డీలర్లు స్థానికంగా పంపిణీ చేయాలని, 26 నుంచి 30 వరకు దివ్యాంగులకు, వృద్ధులకు ఇంటి వద్దకు వెళ్లి పంపిణీ చేయాలని సూచించారు. సమావేశంలో సీఎస్‌డీటీ వాణి బాయి, ఆర్ఐ జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందిస్తున్న చేనేత ప్రముఖులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన నిమ్మర్తి ఆంజనేయులు వారం క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. చేనేత ప్రముఖులు శంకర్ యుగంధర్, శంకర్ తేజ బుధవారం మృతుని కుటుంబ సభ్యులకు రూ.20వేలు, చింతా కుమార్ రూ.5వేలు చొప్పున ఆర్థికసాయం అందించారు.

భవన నిర్మాణానికి విరాళం

ధర్మవరం అర్బన్: మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సంఘం భవన నిర్మాణానికి యూటీఎఫ్ నాయకులు చేయూతనందించారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి, జిల్లా నాయకులు రామకృష్ణ నాయక్, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు, సీఐటీయూ నాయకులు జేవీ రమణ రూ.10వేల విరాళాన్ని బుధవారం పారిశుధ్య కార్మికుల సంఘం నాయకులు బాబు, ముకుంద, ఓబిలేసు, పుల్లన్న, చెన్నకేశవులు, వెంకటరాముడు, రమేష్, శ్రీనివాసులుకు అందించారు.

మత సామరస్యానికి ప్రతీక మొహర్రం

- రేపటి నుంచి మొహర్రం వేడుకలు

బత్తలపల్లి: హిందూ ముస్లింలు కలసికట్టుగా జరుపుకునే మొహర్రం పండుగ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. ఇది పేరుకు ముస్లింల పండుగైనా హిందువులు కూడా సంక్రాంతి, ఉగాది, దీపావళి, దసరాలతో సమానంగా ప్రాధాన్యతనిస్తూ జరుపుకుంటున్నారు. కుల మతాలకతీతంగా వెండి, ఇత్తడి పంచలోహాలతో ఎవరి శక్తికొద్ది వారు మొక్కుల రూపంలో పీర్లను తయారు చేయించి ప్రార్థనలు చేయడం విశేషంగా చెప్పుకోవచ్చు. తాము చేయించిన పీర్లకు ప్రతి సంవత్సరం మొహర్రం సందర్భంగా భక్తులు పూలు, బట్టలు అందజేయడం ఆనవాయితీగా వస్తోంది. ప్రతి సంవత్సరం మొహర్రం నెలలో నెలవంక కన్పించిన మూడవ రోజు అంత వరకు పెట్టెలో భద్రపరిచిన పీర్లను నిర్వాహకులు దించి, చదివింపులు చేసి ప్రత్యేక ప్రార్థనలతో పీర్ల చావిడిలో నిలుపుతారు. రోజూ ఉదయం, సాయంత్రం వేళ్లలో పీర్లను ఊరేగిస్తారు.ఈ పర్వదినాలలో చివరి మూడు రోజులు ముఖ్యమైనవి. అగ్నిగుండాలు ఏర్పాటు చేసి పీర్లను మోస్తూ అందులో నడుస్తారు. మొహర్రం రోజు ఉదయం పీర్లు సలాములందుకుంటాయి. అనంతరం సాయంత్రం అమరులైన పీర్లను తిరిగి ఊరేగించి రకరకాల వేషధారణలతో కర్రసాములతో ఒకరిపైనొకరు గంధం, రంగులు చల్లుకుంటూ పండుగను వైభవోపేతంగా నిర్వహిస్తారు.



బత్తలపల్లిలోని కాశీంస్వామి పీరు (ఫైల్)

పానకం కడవలతో నైవేద్యం..

పెద్దగుండం, చిన్నగుండం కాలే రెండు రోజులు తమ గృహాల నుంచి డప్పులు, మేళ తాళాలతో భక్తులు పానకం కడవలను, పంచదార, బెల్లంను పీర్ల వద్దకు తెచ్చి చదివింపులు ఇచ్చి నైవేద్యాన్ని అందరికీ పంచి మొక్కులు తీర్చుకుంటారు. దీనివల్ల తమ కోర్కెలు తీరుతాయని భక్తుల విశ్వాసం. బత్తలపల్లి మండలంలోని బత్తలపల్లి, గంటాపురం, వేల్పుమడుగు, పోట్లమర్రి, లింగారెడ్డిపల్లి, సంజీవపురం, రాఘవంపల్లి, యర్రాయపల్లి, అనంతసాగరం, వెంకటగారిపల్లి, మాల్యవంతం, అప్రాచెరువు, తంబాపురం, గరిశలపల్లి, కోడేకండ్ల, ఓబుళాపురం, నల్లబోయనపల్లి తదితర గ్రామాలతో పాటు జిల్లాలోని పలు గ్రామాల్లో హిందూ ముస్లింలు కలిసికట్టుగా ఈ వేడుకలను వైభవంగా నిర్వహిస్తారు.



ఉత్సవాలకు ముస్తాబవుతున్న బత్తలపల్లిలోని పీర్ల చావిడి

మొహర్రం విశిష్టత..

ముస్లిం క్యాలెండర్ హిజ్రీ ప్రకారం 12 మాసాలలో మొహర్రం మొదటి నెల. ఈ నెలలో నెలవంక కనిపించిన మూడవ రోజు నుంచి మొహర్రం ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఇస్లాం మత ధర్మం కోసం దేవుని మార్గంలో ప్రాణాలర్పించిన త్యాగమూర్తిగా హజరత్ ఇమామ్ హుసేన్ నిలిచాడు. మహమ్మద్ ప్రవక్తముని మనవడైన ఆయనను స్మరించుకుంటూ ఈ ఉత్సవాలను జరుపుకోవడం ఆనవాయితీ. మొహర్రం పండుగకు పీర్ల పండుగ అని కూడా పిలువడం పరిపాటి. ఈ నెల 27 నుంచి మొహర్రం పండుగను జరపడానికి మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇందుకు సంబంధించి ఆయా గ్రామాల్లో గ్రామ పెద్దలు చర్చించుకుంటున్నారు. పోలీసుల అనుమతులను కోరుతున్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

బత్తలపల్లి: విద్యార్థులు సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని బత్తలపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి అరుణ్‌కుమార్, ధర్మవరం మలేరియా సబ్ యూనిట్ అధికారి జయరాంనాయక్ అన్నారు. బుధవారం బత్తలపల్లిలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల బాలుర పాఠశాలలో దోమల నివారణ మందు స్ప్రేయింగ్ చేశారు. బత్తలపల్లి వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో మలేరియా వ్యాధి నివారణ చర్యల్లో భాగంగా దోమల నివారణకు దోమల మందు (మెలాథియాన్ డబ్ల్యూడీపీ 25 శాతం) హాస్టల్‌లోని విద్యార్థుల గదుల్లో దోమల మందు స్ప్రే చేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ నీరు నిల్వ ఉన్న చోటే డెంగీ జ్వరాలకు కారణమయ్యే దోమలు అభివృద్ధి చెందుతాయన్నారు. ప్రతి శుక్రవారం ఇళ్లల్లో ట్యాంకులు, డ్రమ్ముల్లో నీళ్లు నిల్వ లేకుండా చేయడం, పరిసరాలను శుభ్రం చేసుకోవడం ద్వారా డెంగీ అరికట్టవచ్చని చెప్పారు. మురుగునీటి నిల్వ ఉన్న ప్రాంతాలలో వేస్ట్ ఆయిల్ పోయాలన్నారు. వేడిగా ఉన్న ఆహార పదార్థాలనే తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ రాజశేఖర్, సూపర్‌వైజర్ అశ్వత్థనారాయణ, హాస్టల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్త మారుతి ప్రసాద్, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



గురుకుల పాఠశాలలో దోమల నివారణకు స్ప్రేయింగ్ చేయిస్తున్న వైద్యాధికారులు

సచివాలయ ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ధర్మవరం రూరల్: సచివాలయ ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం నిరసనబాట పట్టారు. బుధవారం నల్లబ్యాడ్జీలు ధరించి ఎంపీడీఓ కార్యాలయం నుంచి కళాజ్యోతి సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు అంకే శ్రీధర్, ఉపాధ్యక్షులు విజయ్‌కుమార్ తదితరులు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులకు సర్వీసు రూల్స్ కల్పించాలన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం తక్షణమే కమిటీ వేయాలన్నారు. ప్రమోషన్లు కల్పించాలని, 9 నెలల పెండింగ్ అరియర్స్ తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పదోన్నతులు ఇచ్చిన తరువాత బదిలీ చేయాలన్నారు. పెండింగ్ నోషనల్ ఇంక్రిమెంట్లు వెంటనే ఇవ్వాలన్నారు. అనంతరం ఎంపీడీఓ సాయి మనోహర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో రాజ్‌కుమార్, తుకారాం తదితరులు పాల్గొన్నారు.

ఓడీచెరువు : గ్రామ సర్వేయర్లు బుధవారం నిరసన తెలియజేశారు. ఈ మేరకు గ్రామ సర్వేయర్ల సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ అనంతాచారికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సర్వేయర్లు వెంకటేశ్, శ్రీనివాసులు, అశోక్, బాబాజాన్, రామాంజినేయులు, జ్యోష్ణ, వీణాలత, షీరిన్ పాల్గొన్నారు

నేడు ముదిగుబ్బలో విద్యుత్ సరఫరా నిలిపివేత

ముదిగుబ్బ: ముదిగుబ్బ ఫీడర్ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శివతేజ ఓ ప్రకటనలో తెలిపారు. మూడు పాత సీటీలను కొత్త 33 కేవీ సీటీలతో భర్తీ చేయడం కోసం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ అంతరాయం

కదిరి టౌన్: మున్సిపల్ పరిధిలోని కుటాగుళ్ల 11 కేవీ ఫీడర్, సైదాపురం అగ్రికల్చర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ చెన్నక్రిష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త రైల్వే బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా విద్యుత్ లైన్లు పాతవి తీసి కొత్తవి మార్చుతున్నందున గురువారం కుటాగుళ్లలో ఉదయం 8–30 నుంచి సాయంకాలం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సమస్యలు పరిష్కరించండి



నిరసన తెలుపుతున్న గ్రామ సర్వేయర్లు

నల్లచెరువు: తమ దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని గ్రామ సర్వేయర్లు కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద వారు నిరసన తెలియజేశారు. ప్రభుత్వం సమస్యలను పరిష్కరించేంత వరకు శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో మండలంలోని సర్వేయర్లు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం నేటికి వాయిదా

చెన్నేకొత్తపల్లి: కోరం లేకపోవడంతో మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేశారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీపీ అంజలి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించేందుకు అధికారులు నిర్ణయించారు. ఉదయం 11 గంటలకు మండల స్థాయి అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, జెడ్పీటీసీ గోవిందరెడ్డి హాజరయ్యారు. అయితే ఒంటి గంట వరకు ఎంపీటీసీలు హాజరు కాలేదు. సమావేశానికి కొద్దిమంది ఎంపీటీసీలు హాజరు కావడంతో కోరం లేక సమావేశాన్ని గురువారానికి వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ బాలక్రిష్ణుడు తెలిపారు. గురువారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి పూర్తిస్థాయిలో ఎంపీటీసీలు, సర్పంచులు తప్పక హాజరు కావాలని సూచించారు. సమావేశం వాయిదా పడటంతో సభ్యులు కార్యాలయం నుంచి వెళ్లిపోయారు.

కంప్యూటర్ వితరణ



కంప్యూటర్‌ను హెచ్‌ఎంకు అందజేస్తున్న సూర్యశేఖరరెడ్డి

గాండ్లపెంట: మలమీదపల్లి ఉన్నత పాఠశాల గణితశాస్త్ర ఉపాధ్యాయుడు సూర్యశేఖరరెడ్డి విద్యార్థుల కోసం రూ.25వేలు విలువ చేసే కంప్యూటర్‌ను వితరణ చేశారు. ఈ కంప్యూటర్‌ను బుధవారం ప్రధానోపాధ్యాయుడు హైదర్‌వలికి అందజేశారు. గణిత ఉపాధ్యాయుడిని సహచర ఉపాధ్యాయులు అభినందించారు.

ఈ-కేవైసీ చేయించుకుంటేనే అన్నదాత సుఖీభవ

తాడిమర్రి: పంట సాగుచేస్తున్న రైతులు ఈ-కేవైసీ చేయించుకుంటేనే అన్నదాత సుఖీభవ పథకం వర్తిస్తుందని ధర్మవరం ఏడీఏ కృష్ణయ్య సూచించారు. తాడిమర్రిలోని రైతు సేవ కేంద్రంలో బుధవారం ఏఓ శేఖర్ నాయక్ అధ్యక్షతన మండలంలోని రైతు సేవ కేంద్రాల సిబ్బంది సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సచివాలయాల్లో అతికించిన జాబితా ఈ-కేవైసీ చేయించుకున్న రైతుల జాబితా మాత్రమేనన్నారు. జాబితాల్లో లేని రైతులు తప్పని సరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని సూచించారు. అర్హత ఉన్న ప్రతి రైతుకూ 40 శాతం సబ్సిడీతో విత్తన వేరుశనగ, సబ్సిడీపై కంది, పెసర అందిస్తామన్నారు. రైతు సేవ కేంద్రం సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సాగు గణన, ఈ-క్రాప్ బుకింగ్ చేయాలన్నారు. పంటలను ఆశించే చీడ,పీడల నివారణపై రైతులకు పలు సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ కృష్ణయ్య

మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు చేసుకుంటే వాటి ఆధారంగా ఎరువులు వాడితే పెట్టుబడి ఖర్చు తగ్గడమే కాక పంట దిగుబడి అధికంగా ఉంటుందని రైతులకు అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈఓ వైష్ణవి, గౌతమి, శ్రీకాంత్‌రెడ్డి, నిజాముద్దీన్ తదితర రైతు సేవ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

తనకల్లు: చెడు అలవాట్లకు యువత దూరంగా ఉండాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ మారుతీరావు సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ కొందరు యువకులు మద్యం, మాదకద్రవ్యాలు, గంజాయి తదితర వాటికి బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. మాదక ద్రవ్యాలను సేవించినా, విక్రయించినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుండే లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని, ఆ దశగా ముందుకు సాగాలని పేర్కొన్నారు. అనంతరం చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్ఐలు జిలానీబాషా, తిప్పేస్వామి, ప్రిన్సిపాల్ చెన్నపకేశవ ప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్, వెంకటరమణారెడ్డి, అధ్యాపకులు ప్రమీల, ప్రభాకర్, భైరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ మారుతీరావు

హక్కుల సాధన పోరాట స్ఫూర్తి సంవిధాన్ హత్య దివస్

ధర్మవరం అర్బన్: ఎమర్జెన్సీ సమయంలో స్వేచ్ఛ హక్కుల సాధన కోసం పోరాట స్ఫూర్తిగా సంవిధాన్ హత్య దివస్ జరుపుకుంటారని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. స్థానిక కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం సంవిధాన్ హత్య దివస్ కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం అధికారి గోపాల్‌నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంవిధాన్ హత్య దివస్ పాటించడం ద్వారా ప్రతి భారతీయుడిలో వ్యక్తిగత స్వేచ్ఛ, ప్రజాస్వామ్య రక్షణ అనే శాశ్వత జ్వాల సజీవంగా ఉంటుందని తద్వారా నియంతృత్వ శక్తులు భయానక పరిస్థితులను పునరావృతం చేయకుండా నిరోధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు చిట్టెమ్మ, త్రివేణి, షమీవుల్లా, కిరణ్‌కుమార్, హైమావతి, పుష్ప, సరస్వతి, ఆనంద్, మీనా, ధనుంజయ, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి

అధికారులకు సన్మానం



అధికారులను సత్కరిస్తున్న దృశ్యం

ముదిగుబ్బ: మండలం నుంచి బదిలీపై వెళ్తున్న ఏఓ లక్ష్మీనరసింహులు, ఉద్యానశాఖ అధికారి అమరేశ్వరిలను బుధవారం ఉద్యోగులు సన్మానించారు. ఈ సందర్భంగా వారి సేవలను ఎంపీపీ ఆదినారాయణ కొనియాడారు. కార్యక్రమంలో ఎంఏఓ రవీంద్ర, నాయకులు అంజన్‌రెడ్డి, ఎరువుల దుకాణ యజమానులు తదితరులు పాల్గొన్నారు.

29న ఉచిత వైద్య శిబిరం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని స్పందన ఆస్పత్రిలో ఈ నెల 29న ఉచిత సంతాన సాఫల్య, గర్భకోశ వ్యాధులతో పాటు ఊపిరితిత్తులు, ఛాతీ జబ్బుల వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆస్పత్రి వ్యవస్థాపక వైద్యులు డాక్టర్ టీఎం బషీర్, వై సోనియా తెలిపారు. ఈ మేరకు వారు బుధవారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. సంతానం కలగని దంపతులను పరీక్షించి, అవసరమైన వారికి స్కానింగ్ నిర్వహించి తగిన సలహాలు అందిస్తామని పేర్కొన్నారు. గర్భకోశ వ్యాధులున్నవారికి ఉచితంగా పరీక్షిస్తామని తెలిపారు. ఊపిరితిత్తులు, ఛాతీ జబ్బులున్నవారికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించనున్నామని తెలిపారు. ఆదివారం ఉదయం పది గంటలకు నిర్వహించి వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గుండెపోటుతో ఆర్‌ఎంపీ మృతి

ముదిగుబ్బ: ఆర్‌ఎంపీ గుండెపోటుకు గురై మృతి చెందాడు. బుక్కపట్నం మండలం కొండాపురం గ్రామానికి చెందిన కుళ్లాయప్ప(38) అనే ఆర్‌ఎంపీ ముదిగుబ్బలో ప్రథమ చికిత్స కేంద్రం (క్లినిక్) నిర్వహిస్తున్నాడు. బుధవారం క్లినిక్‌లో ఉండగా ఉన్నపళంగా ఛాతీలో నొప్పి రావడంతో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే కుళ్లాయప్ప మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

పండ్లతోటల పెంపకం సద్వినియోగం చేసుకోవాలి

తనకల్లు: పండ్లతోటల పెంపకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రామానాయక్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పండ్లతోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. 2025–26 ఏడాదికి గాను ఉపాధి హామీ పథకంలో భాగంగా మామిడి, జామ, సపోట, కొబ్బరి, దానిమ్మ, అల్ల నేరేడు, సీతాఫలం, మునగ, డ్రాగన్ ఫ్రూట్, మల్లె, గులాబీ, పూలతోటలు తదితర 18 రకాల మొక్కలను అందజేయనున్నట్లు తెలిపారు. అర్హులైన చిన్న, సన్న కారు రైతులు జూలై ఒకటో తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. గ్రామాల్లో ఉపాధి హామీ పనులు వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ మరియమ్మ, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ రామానాయక్

పార్కింగ్ ఫీజు వసూలుకు వేలం పాట

నల్లచెరువు: మండలంలో ప్రసిద్ధి చెందిన పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం శ్రావణమాస ఉత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో పార్కింగ్ ఫీజు వసూలుకు సంబంధించి వేలం నిర్వహించారు. రూ.1.32 లక్షలకు పార్కింగ్ వసూలు చేసే హక్కును బి.వసంత్ నాయక్ దక్కించుకున్నారు. అలాగే పూజా సామగ్రి, టెంకాయలు విక్రయించే హక్కు కోసం జూలై రెండో తేదీన వేలం నిర్వహించనున్నట్లు ఈఓ మురళీకృష్ణ తెలిపారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దు



ట్రాఫిక్‌పై సూచనలిస్తున్న డీఎస్పీ

కదిరి టౌన్: పట్టణంలోని ఆటో డ్రైవర్లు, తోపుడు బండ్ల వ్యాపారులు ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలని డీఎస్పీ శివనారాయణస్వామి ఆదేశించారు. బుధవారం పోలీస్ స్టేషన్‌లో ఆటో డ్రైవర్లు, తోపుడు బండ్ల వ్యాపారులతో ఆయన సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, తోపుడుబండ్లను రోడ్డుకు అడ్డంగా పెట్టి వ్యాపారాలు చేయరాదని సూచించారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ వి.నారాయణరెడ్డి, ఎస్ఐ బాబ్జాన్, సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి మృతి

ముదిగుబ్బ: రోడ్డు ప్రమాదంలో గాయపడి కోమాలోకి వెళ్లిన యువకుడు ఐదు నెలల తర్వాత మృతి చెందాడు. ముదిగుబ్బకు చెందిన కరణం దిలీప్‌కుమార్ (26) ఈ ఏడాది జనవరి నాలుగో తేదీన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. కోమాలోకి వెళ్లిన అతడు అప్పటి నుంచి చికిత్స తీసుకుంటున్నాడు. అయినా పరిస్థితి మెరుగుపడకపోవడంతో బుధవారం ఆస్పత్రిలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఇందుకూరులో 'అంగన్‌వాడీ పిలుస్తోంది'



చిన్నారులకు అక్షరాభ్యాసం చేస్తున్న దృశ్యం

ముదిగుబ్బ: ఇందుకూరులో బుధవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లలితమ్మ ఆధ్వర్యంలో 'అంగన్‌వాడీ పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఎంపీటీసీ మధుసూదనదేవి హాజరయ్యారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. అంతకు ముందు గ్రామంలో ర్యాలీని నిర్వహించారు. సూపర్‌వైజర్ మాట్లాడుతూ మూడేళ్ల నుంచి ఆరేళ్ల వయసు గల పిల్లలను అంగన్‌వాడీలో చేర్పించడానికి ఈ కార్యక్రమం చేపట్టామన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీలో చేర్పించండి

తాడిమర్రి: మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చంద్రమ్మ తల్లులకు సూచించారు. చిల్లకొండయ్యపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్తలు ఆదెమ్మ, కాంతమ్మల అధ్యక్షతన జరిగిన సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ చిన్నారులకు పలక పట్టించి అక్షరాలు దిద్దించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చిన్నారుల్లో సమగ్ర అభివృద్ధి జరగాలంటే మొదటి ఆరేళ్లు కీలకం అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలు, విద్యాబుద్ధులు నేర్పిస్తారన్నారు. కార్యక్రమంలో దాడితోట సెక్టారులోని అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీపీఐ నాయకుడి మృతి



నాగరాజు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని న్యామద్దెల గ్రామానికి చెందిన సీపీఐ నాయకుడు నాగరాజు (53) అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు సీపీఐ మండల రైతు సంఘం నాయకుడు ముత్యాలు తెలిపారు. కొన్ని వారాలుగా అనారోగ్యంతో బాధపడుతున్న నాగరాజును కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య పోలేరమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. విషయం తెలుసుకున్న సీపీఐ రైతు సంఘం నాయకుడు రమణ, మండల నాయకుడు ముత్యాలు, నాయకులు శివమూర్తి, రాము, తిమ్మయ్య, నరసింహులు, రామప్ప, రామగిరి మండల నాయకుడు పోలేపల్లి ముత్యాలు తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నాగరాజు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.